## పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్

ఆర్మూర్, నవంబర్5: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆదివారం వివిధ రాజకీయ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, జాతీయ పార్టీల ప్రతినిధులకు ఆదివారం అధికారులు ఎన్నికల నియమావళిపై శిక్షణ ఇచ్చారు. ఎన్నిక నిర్వహణ ఖర్చులు, ఖాతాల నిర్వహణపై ఆర్మూర్ తహసీల్దార్ గుండు ఆళ్వార్ శ్రీకాంత్ అవగాహన కల్పించారు.

## కేదారేశ్వర ఆశ్రమంలో దత్తాత్రేయ పూజలు



పూజలు నిర్వహిస్తున్న మంగిరాములు మహరాజ్

నందిపేట్, నవంబర్ 5: మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమంలో (పలుగుట్ట) ఆదివారం 128 జంటలతో పూజలు నిర్వహించామని మంగిరాములు మహరాజ్ తెలిపారు. అష్టమి సందర్భంగా ప్రత్యేకంగా దత్తాద్రి పూజలు, కలుశాలతో దత్త పారాయణం చేశామన్నారు. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

## ఘనంగా మహాలక్ష్మి పండుగ

మాక్లూర్, నవంబర్ 5: ముల్లంగి(బి) తదితర గ్రామాల్లో మహాలక్ష్మీ పండగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మహాలక్ష్మీ, పోచమ్మ మందిరాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. మేకలను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

## శిలాఫలకం ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు



ఆర్మూర్ వెంకటేశ్వర కాలనీలో ధ్వంసం చేసిన శిలా పలాకం

ఆర్మూర్, నవంబర్5: పట్టణంలోని మామిడిపల్లి పరిధిలోని వెంకటేశ్వర కాలనీలోని విద్యానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకం ధ్వంసంపై ఆదివారం విద్యానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆర్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మామిడిపల్లి పరిధిలోని వెంకటేశ్వర్ కాలనీలో40/85,86 సర్వేనంబర్‌లో 2018 ఫిబ్రవరి 2న విద్యానగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌కు 10 శాతం స్థలం కేటాయించగా 2018 ఆగస్టు 1న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి జీవన్‌రెడ్డి సైతం ప్రొసీడింగ్ కాపీ సైతం అందజేశారు. ఆదివారం కాలనీల ప్రతినిధులు అక్కడికి వెళ్లి చూడగా స్థలాన్ని చదును చేసి, శిలఫలకం ధ్వంసం చేసి ఉందని తెలిపారు. చుట్టు పక్కల కుటుంబాల వారు దౌర్జన్యంగా ఈ పనిచేశారని వారు పేర్కొన్నారు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాలనీ అబివృద్ధి కమిటీ సభ్యులు ముత్యాల గంగారెడ్డి, శేఖర్, బాబగౌడ్, సత్యనారాయణ, లక్ష్మి, అమృత, పద్మ, బాల గణేశ్, రమేశ్, రాజేశ్వర్, ప్రశాంత్ తెలిపారు.

# వన్‌సైడ్ వార్.. ఎదురులేని కారు

- అభివృద్ధి అస్త్రంతో గెలుస్తా
- అరాచక శక్తులను ఓడిస్తా
- కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు
- నికాల్‌పూర్, కోమట్‌పల్లి, అన్నారం, సిర్పూర్ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్రలో జీవన్‌రెడ్డి
- విస్తృతంగా ఎన్నికల ప్రచారం





ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రసంగాన్ని వింటున్న ప్రజలు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



ఫత్తేపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి రజితారెడ్డి



ఫత్తేపూర్‌లో వృద్ధుడికి కరపత్రం అంజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి రజితారెడ్డి

నందిపేట్, నవంబర్ 5: ఆర్మూర్ నియోజకవర్గంలో వార్ వన్‌సైడ్ అని, కారు జోరుకుగా ఎదురు లేదని బీఆర్ఎస్ అభ్యర్థి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. 'ప్రజా ఆశీర్వాద యాత్ర' కార్యక్రమంలో భాగంగా ఆదివారం డొంకేశ్వర్ మండలంలోని నికాల్‌పూర్, కోమట్‌పల్లి, అన్నారం, సిర్పూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి డప్పు వాయిధ్యాలు, మేళతాళాలతో, మహిళలు బోనాలతో వందలాది మంది యువకులు బైక్ ర్యాలీలతో ఘనస్వాగతం పలికారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలతో తనకున్న అనుబంధాన్ని ప్రజలతో పంచుకున్నారు. వందలాది మంది వెంట రాగా జీవన్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి తిరిగి బీఆర్ఎస్‌కు ఓటేయాలని, మళ్లీ తనను గెలిపించాలని కోరారు. అనంతరం నిర్వహించిన సభల్లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తాను పదేండ్లలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధిని వివరించారు. మరోసారి ప్రజల ఆశీస్సులు పొందడానికి వచ్చాననని అన్నారు. రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు, సీఎం సహాయనిధి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పల్లెప్రగతి, మన ఊరు – మన బడి, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు అన్ని కులసంఘాలకు భవనాలన నిర్మాణం వంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి నికాల్‌పూర్, కోమట్‌పల్లి, అన్నారం, సిర్పూర్ గ్రామాలకు వందలాది కోట్ల రూపాయల నిధులొచ్చాయని జీవన్‌రెడ్డి వెల్లడించారు. చేపట్టిన పనులు, పథకాల వారీగా ఖర్చు చేసిన వివరాలడ నివేదికలను ప్రజల ముందుంచారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు రూ.3 వేల భృతితోపాటు ఆసరా పింఛన్లు రూ.5 వేలకు, దివ్యాగుల పింఛన్లు రూ.6 వేలకు, రైతుబంధు రూ.16 వేలకు పెరుగుతాయన్నారు. అర్హులైన వారికి రూ.400లకే సిలిండర్, తెల్ల రేషన్ కార్డున్న వారికి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. రూ.5లక్షల చొప్పున వచ్చే కేసీఆర్ బీమా ప్రతి ఇంటికీ ధీమా అన్నారు. 62 ఏడ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీతో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి శూన్యమని అన్నారు. గ్రామాలు సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధికి నోచుకున్నాయని జీవన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కేసీఆర్ తెచ్చిన పల్లెప్రగతితో గ్రామాల రూపురేఖలు మారాయని, పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి బాట పట్టాయన్నారు. గాంధీజీ కలలు గన్న గ్రామ రాజ్యం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందున్నారు. అభివృద్ధి అస్త్రంతో గెలుస్తానని, అరాచక శక్తులకు ఓడిస్తానని, ఆర్మూర్ ప్రజలు ఆత్మగౌరవ ప్రతీకలు, ప్రతి గుండెలో గులాబీ జెండా ఎగురుతోందని అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ప్రజలంతా బీఆర్ఎస్‌కు అండగా నిలిచి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

### ఎమ్మెల్యే సతీమణి విస్తృత ప్రచారం..

ఆర్మూర్, నవంబర్5: మండలంలోని ఫత్తేపూర్, సుర్బిర్యాల్ గ్రామాల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గంలో, ఫత్తేపూర్, సుర్బిర్యాల్ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

## అయ్యప్ప సేవా సమితి నూతన కార్యవర్గం

శక్కర్‌నగర్, నవంబర్ 5: బోధన్ పట్టణంలోని భీముని గుట్ట అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం బోధన్ అయ్యప్ప సేవా ట్రస్ట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లెంపాటి శివన్నారాయణ, క్యాదర్శిగా ఐఆర్. చక్రవర్తి, ఉపాధ్యక్షుడిగా సూరబత్తుని శ్రీనివాస్ రావు, కోశాధికారిగా కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్, సహాయ కార్యదర్శిగా రమేశ్, సభ్యులుగా గోవింద్‌రెడ్డి, కొడాలి కిశోర్, స్వామిగౌడ్, అబ్బారెడ్డి, కంచోజు సత్యనారాయణ, మాశెట్టి నర్సయ్య గుప్తా, పోశెట్టి, చల్లా శ్రీనివాస్ రావు, పురాణిక్ సంతోష్ శర్మను ఎన్నుకున్నారు. వివరాలను మేనేజింగ్ ట్రస్టీ గంజి వెంకటేశం వెల్లడించారు.



బోధన్ అయ్యప్ప సేవా సమితి నూతన కార్యవర్గంతో సభ్యులు

## గుండె పోటుతో బీఆర్ఎస్ నాయకుడు మృతి

### రాంరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు : ఎమ్మెల్యే షకీల్



రాంరెడ్డి(ఫైల్)

నవీపేట, నవంబర్ 5: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నిజాంపూర్ డి 50 చైర్మన్ ఎన్.రాంరెడ్డి(72) ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతి చెందాడు. నవీపేటకు చెందిన ఆయన పార్టీకి చేసిన సేవలను స్థానిక ఎమ్మెల్యే షకీల్ గుర్తు చేసుకున్నారు. రాంరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు రాంరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంరెడ్డి అంత్యక్రియలు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు తెలిపారు.